సాక్షి నిర్మల్

గురువారం । 17 । జూలై । 2025



నారుమడులకు నీరేది?

'స్వర్ణ' ఆయకట్టు అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వర్షాలు లేక ప్రాజెక్ట్ నిండకపోవడంతో నీరు రాక వరినార్లు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. 9లో▸



గోరింటాకు వేడుకలు

ఆషాఢం సందర్భంగా గోరింటాకు వేడుకలు జరుపుకొంటున్నారు. చేతులకు గోరింటాకు పెట్టుకుంటున్న మహిళలు దాని ఆరోగ్య ప్రయోజనాలు తెలుసుకుంటున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
30.0 /24.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

'కేంద్ర' పథకాల పరిశీలన



ఇంకుడుగుంత పరిశీలిస్తున్న టీం సభ్యులు

కుంటాల: మండలంలోని అందకూర్, అంబకంటి తండాల్లో ఎల్‌ఎన్‌ఎం టీం సభ్యులు బుధవారం కేంద్ర ప్రభుత్వ పథకాలను పరిశీలించారు. ఈజీఎస్, సంసద్ ఆదర్శ గ్రామీణ యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, నేషనల్ పెన్షన్ స్కీమ్ డే తదితర పథకాలను టీం సభ్యులు నారాయణ, రాజేశ్వర్‌రెడ్డి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏవో శ్రీనివాస్, ఎంపీవో ఎంఏ రహీంఖాన్, ఏపీవో నవీన్, పంచాయతీ కార్యదర్శులు, రమ్య, సతీశ్, టీఏలు జైసింగ్, శంకర్, ఎఫ్ఏ భోజన్న తదితరులున్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు ఏర్పాట్లు

నిర్మల్‌టౌన్: ఈనెల 17 నుంచి 20వరకు జిల్లా కేంద్రంలోని కొండాపూర్ వద్ద గల నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఏర్పాట్లు చేశారు. బుధవారం రిఫరీ పీపీఎల్ కుమార్, మ్యాచ్ కంట్రోలర్ భాస్కర్, ఎస్జీఎఫ్ సెక్రటరీ రవీందర్‌గౌడ్ ఏర్పాట్లు పరిశీలించారు. అండర్–19 బాలబాలికలకు సింగిల్స్, డబుల్, మిక్స్ డబుల్ విభాగాల్లో పోటీలుంటాయని తెలిపారు. 17న క్వాలిఫైయింగ్ పోటీలు, 18 నుంచి 20 వరకు మెయిన్ డ్రా పోటీలుంటాయని పేర్కొన్నారు. కోఆర్డినేటర్లు భూమన్న, మధు, నందకుమార్, ప్రశాంత్ ఉన్నారు.

కార్మికులకు స్పెషల్ సెల్

నిర్మల్‌ఖిల్లా: అసంఘటితరంగ కార్మికుల సంక్షేమానికి నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) ఆధ్వర్యంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తూ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్ ఎస్.శ్రీవాణి ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ విభాగంలోని ప్యానెల్ అడ్వకేట్ వీ మధుకర్, ససర్డ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల, పారా లీగల్ వలంటీర్లు ఎస్.కమలాకర్, జాప రాములు ప్రభుత్వ పథకాల అమలులో కార్మికులకు తోడ్పాటునందిస్తారు. సేవలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు



బస్సు ప్రారంభిస్తున్న డీఎం పండరి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రం నుంచి ఏ పుణ్యక్షేత్రానికైనా ఆర్టీసీ బస్సులు నడుపుతామని డీఎం పండరి తెలిపారు. బుధవారం నిర్మల్ నుంచి అరుణాచలం, శ్రీరంగంకు బయలుదేరిన బస్సును ప్రారంభించారు. త్వరలో ప్రయాగ్‌రాజ్, వారణాసి, అయోధ్య, యాదగిరిగుట్ట, స్వర్ణగిరికి బస్సు నడుపనున్నట్లు వివరించారు. వివరాలకు 9959226003, 8328021517 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం


నిర్మల్‌చైన్‌గేట్: బీసీ సంక్షేమ శాఖ, బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గ్రూప్స్ (1,2,3,4), ఆర్‌ఆర్‌బీ, ఎస్సెస్సీ, బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్‌లకు ఫౌండేషన్ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి డీ శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో డిగ్రీ పాసైనవారు ఈనెల 16 నుంచి వచ్చే నెల 11వరకు www. tgbcstudycircle.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆగస్టు 25నుంచి శిక్షణ ప్రారంభమై 150రోజులు కొనసాగుతుందని తెలిపారు. తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాలవారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాలవారికి రూ.2లక్షలలోపు ఉండాలని పేర్కొన్నారు. డిగ్రీలో అత్యధిక శాతం మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం అభ్యర్థుల ఎంపిక విధానం ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.వెయ్యి చొప్పున ఐదునెలలు స్టైఫండ్ మంజూరు చేస్తారని పేర్కొన్నారు. వివరాలకు 08732221280 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి

మామడ: విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకుని పరిశోధనల వైపు అడుగులు వేయాలని అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. బుధవారం మండలంలోని పొన్కల్ జెడ్పీ హైస్కూల్‌లో బాలశక్తి కార్యక్రమాన్ని ప్రారంభించి సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. సైన్స్‌ల్యాబ్‌ను సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పదో తరగతి పరీక్షాకేంద్రం ఏర్పాటు, అదనపు తరగతి గదులు, మూత్రశాలలు, డైనింగ్‌హాల్ నిర్మించాలని వీడీసీ సభ్యులు అడిషనల్ కలెక్టర్‌ను కోరగా.. సమస్యలు కలెక్టర్‌కు తెలిపి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డీఈవో రామారావు, డీఎంహెచ్‌వో రాజేందర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్, ఎంఈవో రమణారెడ్డి, హెచ్ఎం అరవింద్‌కుమార్, ఎంపీడీవో సుశీల్‌రెడ్డి, వీడీసీ, వీఈడీసీ సభ్యులున్నారు.

డెంగీ అటాక్..!

- జిల్లాలో దోమల స్వైరవిహారం
- పెరుగుతున్న జ్వర పీడితులు
- జిల్లాలో 100 మంది బాధితులు
- చికిత్స కోసం ఆస్పత్రుల్లో చేరిక
- చర్యలు చేపట్టాలంటున్న ప్రజలు



జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

నిర్మల్: పడుతూ ఆగుతున్న వర్షాలు, మళ్లీ మండుతున్న ఎండలు.. ఇలా వాతావరణంలో తీవ్రమార్పులతో పాటు అపరిశుభ్రతతో జిల్లాలో దోమలు పెరుగుతున్నాయి. ఇప్పటికే వైరల్ ఫీవర్లు ఉండగా, ఇటీవల ప్రాణాంతక డెంగీ బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే వైరల్ ఫీవర్‌లు, జలుబు, జ్వరాలతో జిల్లాప్రజలు బాధపడుతున్నారు. మరోవైపు క్రమంగా డెంగీ అటాక్ చేస్తోంది. జిల్లాలో ఇప్పటివరకు వందమంది వరకు డెంగీ బారినపడ్డట్లు సమాచారం. స్థానిక ఆస్పత్రులతో పాటు నిజామాబాద్, హైదరాబాద్‌లో కొందరు చికిత్స పొందుతున్నారు. ప్రతీ వర్షాకాలం సీజన్ మొదలైందంటే.. డెంగీకి భయపడాల్సి వస్తోంది. ఈసారి సీజన్‌లోనూ దోమలు పెరుగుతున్నాయి. క్రమంగా బాధితులూ పెరుగుతున్నారు. జిల్లా ఆస్పత్రుల్లో డెంగీకి కావాల్సిన వైద్య సదుపాయాలు, ప్లేట్‌లెట్స్ కౌంటింగ్ యంత్రం అందుబాటులో ఉన్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.

పగటిపూటనే కుట్టే 'టైగర్'..

టైగర్ (ఎడిస్ ఈజిప్టై) ఈ దోమనే మనిషి ప్రాణాలు తీసే డెంగీకి కారకం. పగటి పూట మాత్రమే కుట్టే ఈ దోమ మనిషి ప్రాణాలనూ తీస్తుంది. ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఇది కుడుతుంది. రాత్రిపూట చీకటి ప్రదేశాల్లో విశ్రాంతి తీసుకుంటుంది. చూసేందుకు మామూలు దోమ కంటే చిన్నసైజులో ఉండే దీని కాళ్లు, రెక్కలపై తెల్లమచ్చలుంటాయి. నేలకు తక్కువ ఎత్తులో తిరుగుతూ.. ఎక్కువగా కాళ్లు, మడమల వద్ద కుడుతుంది. డెంగీ బారిన పడినవారికి తీవ్రమైన జ్వరం, జలుబు, వాంతులు, నొప్పులు మొదలవుతాయి. రక్తంలో ప్లేట్‌లెట్స్ పడిపోతాయి. సరైన చికిత్స తీసుకోకపోతే మనిషి ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుంది.

నిర్లక్ష్యంతోనే వ్యాప్తి..

చిన్నపాటి నిర్లక్ష్యంతోనే డెంగీ బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఈ వ్యాధి రావడానికి కారణమైన దోమలను ఓ రకంగా మనమే పెంచుతున్నాం. ప్రధానమంత్రి నుంచి పారిశుధ్య కార్మికుడి దాకా స్వచ్ఛత పాటించండి.. అని ఎంత చెబుతున్నా.. కనీసం వినేవారే లేరు. ఈ నిర్లక్ష్యం కారణంగా పెరిగే అపరిశుభ్రతే టైగర్ దోమ వ్యాప్తికి కారణమవుతోంది. టైగర్ దోమ జీవిత చక్రం వారంరోజుల్లోనే ప్రారంభమవుతుంది. ఇది మిగతా దోమలకు విరుద్ధంగా మంచినీటి నిల్వల్లోనే గుడ్లు పెడుతుంది. మన ఇంటి పరిసరాల్లో నిర్లక్ష్యంగా వదిలేసిన కూలర్లు, పాత్రలు, టబ్బులు, బకెట్లు, పాత సామగ్రి, తాగి పడేసిన కొబ్బరిబోండాలు, చిప్పలు, సీసాలు, ఖాళీ పూలకుండీలు, ప్లాస్టిక్ గ్లాసులు, టైర్లు.. వీటిలోనే వర్షపునీరు చేరి నిల్వ ఉంటుంది. అలాంటి నీటి నిల్వలే ఈ దోమల ఉత్పత్తికి నివాసాలుగా మారుతున్నాయి. ఇవి గుడ్లు పెట్టిన వారంలోనే దోమగా మారి కుట్టడం గమనార్హం.

ఆలస్యం చేస్తే ప్రమాదమే..

పగటిపూట ఎటాక్ చేసే టైగర్‌దోమ వరుసగా ఐదారుసార్లు కుట్టేందుకు ప్రయత్నిస్తుంది. అలా దాని బారిన పడితే ముందుగా తీవ్రమైన జ్వరం వస్తుంది. జలుబు, వాంతులు, కీళ్లనొప్పులు, ఒంటిపై దద్దుర్లు, కంటి సంబంధ సమస్యలు మొదలవుతాయి. ప్లేట్‌లెట్స్ పడిపోతుంటాయి. చాలామంది సాధారణ జ్వరం అనుకుని ఇంటిపట్టునే ఏ ఆర్ఎంపీనో, స్థానిక ప్రాక్టీషనర్‌నో సంప్రదించి మందులు వాడుతుంటారు. అప్పటికీ తగ్గక పోతేనే అర్హత ఉన్న వైద్యుడి దగ్గరికి వెళ్తుంటారు. ఈక్రమంలో ఏమాత్రం ఆలస్యం చేసినా.. ప్లేట్‌లెట్ల సంఖ్య పడిపోయినా ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుంది. నిర్ధారణ పరీక్షతోనే డెంగీ ఉన్నదీ.. లేనిది తెలుతుంది. డెంగీ నిర్ధారణ పరీక్ష చేసుకున్న తర్వాత పాజిటివ్ రిపోర్ట్ వస్తేనే అవసరమైన చికిత్స తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

సకాలంలో చికిత్స పొందాలి



డెంగీ జ్వరంతోనే ప్రారంభమవుతుంది. తీవ్రమైన జ్వరంతో తలనొప్పి రావడం, బీపీడౌన్ కావడం, వాంతులు, కీళ్ల నొప్పులు, దద్దుర్లు తదితర లక్షణాలుంటాయి. జ్వరం తగ్గుతున్నట్లు అనిపించినా ప్లేట్‌లెట్స్ పడిపోతుంటాయి. చాలామంది సాధారణ జ్వరం అనుకుంటారు. కానీ, ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యుడిని సంప్రదించాలి.

– డాక్టర్ బీ రవి, ఎండీ, జిల్లా జనరల్ ఆస్పత్రి

నిర్లక్ష్యం వీడితేనే నివారణ

ఈ సీజన్‌లో ప్రాణాంతక డెంగీ బారిన పడొద్దంటే ముందస్తు చర్యలు తీసుకోవడమే నివారణ మార్గాలని వైద్యులు సూచిస్తున్నారు.

- ముందుగా ఇళ్లు, పరిసరాల్లో డెంగీ దోమ ఉత్పత్తికి కారణమయ్యే నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.
- ఇంట్లో బంతి, తులసి మొక్కలు పెంచుకుంటే దోమలు తక్కువగా వస్తాయి.
- తప్పనిసరిగా గాలి, వెలుతురు ఇంట్లోకి బాగా పడేలా చూసుకోవాలి.
- ఇంటి పరిసరాల్లో పిచ్చిమొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.
- ఇంటి కిటికీలు, తలుపులకు దోమలు రాకుండా జాలీలు ఏర్పాటు చేసుకోవాలి.
- సైడ్ ఎఫెక్ట్స్ ఉండే రసాయనిక కాయిల్స్ అసలే వాడవద్దు. దోమల నివారణకు సంప్రదాయ పొగ వేసుకోవడం ఉత్తమం.
- పగటి పూటైనా పడుకునేటప్పుడు తప్పనిసరిగా దోమతెరలు వినియోగించాలి.
- చిన్నారులకూ పొడవాటి చేతుల చొక్కాలు, ప్యాంట్లు ధరింపజేయాలి.
- డెంగీ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలి.
- మున్సిపల్, పంచాయతీ సిబ్బంది దోమల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి.

ముందస్తు చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్
- చించోలి(బీ)లో నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ శిక్షణ పరిశీలన
- ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో వర్షాలు, అకాల వరదలు సంభవించినపుడు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. బుధవారం చించోలి (బీ) సమీపంలోని ప్రభుత్వ మైనారిటీ పాఠశాలలో నిర్వహించిన విపత్తు నిర్వహణ శిక్షణ కార్యక్రమాన్ని ఆమె అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్డీఆర్ఎఫ్ బృందం సహాయక విన్యాసాలు, ప్రజలకు అవగాహన కల్పించే ప్రదర్శనలను పరిశీలించారు. బృంద సభ్యుల పనితీరును అభినందించారు. వారి వద్ద ఉన్న ఆధునిక పరికరాల వినియోగం, అత్యవసర పరిస్థితుల్లో అవి ఎలా ఉపయోగపడతాయన్న అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా గోదావరి, స్వర్ణ, ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టుల పరీవాహక ప్రాంతాలు, జీఎన్ఆర్ కాలనీ తదితర లోతట్టు ప్రాంతాల ప్రజలు వరదల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వరదల సమయంలో ముందస్తు చర్యలు చేపట్టేందుకు జిల్లా స్థాయిలో ఫ్లడ్ మాన్యువల్ తయారు చేసినట్లు తెలిపారు. కడెం, ఖానాపూర్, సారంగపూర్, దస్తురాబాద్, భైంసా మండలాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించేందుకు 15 రోజులుగా ఎస్డీఆర్ఎఫ్ బృందం పనిచేస్తుందని పేర్కొన్నారు. వరదల సమయంలో ప్రజలు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూమ్‌ను సంప్రదించాలని సూచించారు. అనంతరం మైనార్టీ పాఠశాల ప్రాంగణంలో కలెక్టర్, అదనపు కలెక్టర్లు మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో అదనపు ఆర్డీవో రత్నకళ్యాణి, తహసీల్దార్ రాజు, ఎంపీడీవో లక్ష్మీకాంతం, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో తనిఖీలు

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా విభాగాలు పరిశీలించారు. రోజువారీ ఓపీ వివరాలు తెలుసుకున్నారు. చిల్డ్రన్స్ వార్డును పరిశీలించి మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. మందుల గదులు, టీకా నిల్వల గురించి తెలుసుకున్నారు. సరిపడా మందులు, వ్యాక్సిన్లు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. అనంతరం ల్యాబ్ విభాగాన్ని పరిశీలించి అందుబాటులో ఉన్న పరీక్షల వివరాల గురించి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో పార్కింగ్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవుట్‌పోస్ట్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆస్పత్రి పర్యవేక్షకుడు గోపాల్‌సింగ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

'భరోసా'తో వివాదాలు పరిష్కారం

- ఎస్పీ జానకీ షర్మిల
- భైంసాలో ప్రజావాణి



ఫిర్యాదు పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

భైంసాటౌన్: పట్టణంలో ప్రతీ బుధవారం నిర్వహించే భరోసా కేంద్రం కుటుంబ వివాదాల పరిష్కారంలో సత్ఫలితాలిస్తోందని ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో మాట్లాడారు. అంతకుముందు డివిజన్ పరిధిలోని పలువురు అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. పరిష్కారానికి సంబంధిత ఎస్‌హెచ్‌వోలకు ఫోన్‌లో ఆదేశాలు, సూచనలు చేశారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం భరోసా కేంద్రంలో కుటుంబ వివాదాల కేసులు, పురోగతి వివరాలు తెలుసుకున్నారు. కుటుంబ సమస్యలపై షీటీం సిబ్బంది ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. భైంసాలో భరోసాకేంద్రం ఏర్పాటుపై స్థానికులు హర్షం వ్యక్తంజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏఎస్పీ అవినాష్‌కుమార్, సీఐలు, ఎస్సైలు ఉన్నారు.

మహ్మద్ గౌస్ సేవలు ఎనలేనివి

పట్టణంలో ఎస్సైగా పనిచేసిన మహ్మద్ గౌస్ సేవలు ఎనలేనివని ఎస్పీ జానకీ షర్మిల కొనియాడారు. గౌస్ ఇటీవల రిటైర్డ్ కాగా పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆయనకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ, ఏఎస్పీ అవినాష్‌కుమార్, సీఐలు, ఎస్సైలు గౌస్ విధి నిర్వహణ తీరు కొనియాడారు. అనంతరం శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. సీఐలు గోపీనాథ్, నైలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లున్నారు.

వానాకాలం ఆయకట్టు ఖరారు

- యాక్షన్ ప్లాన్ ప్రకటించిన సాగునీటి శాఖ
- ఉమ్మడి జిల్లాలో ఇంకా పూర్తిగా నిండని ప్రాజెక్టులు
- వానలు లేకపోతే ఆయకట్టు ప్రశ్నార్థకమే

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా ప్రాజెక్టుల ఆయకట్టు కింద వానాకాలంలో సాగయ్యే వివరాలను సాగునీటి శాఖ ప్రకటించింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర స్థాయి ఇంజినీర్ల కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈసారి పలు చోట్ల వర్షాలు తక్కువగా కురవడంతో ప్రాజెక్టుల్లోకి ఇంకా సరిపడా నీరు రాలేదు. దీంతో ప్రాజెక్టుల్లోకి నీరు వచ్చాకే సాగునీటి శాఖ అధికారులు ఆయకట్టు ప్రతిపాదించనున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని సదర్మాట్, నిర్మల్ పరిధిలోని గడ్డెన్నవాగు, ఎస్సారెస్పీ (సరస్వతి కాలువ), మంచిర్యాల జిల్లాలోని గొల్ల వాగు, ర్యాలీ వాగు, నీల్వాయి ప్రాజెక్టులకు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఎన్టీఆర్ సాగర్ ప్రాజెక్టులను మరోసారి సమీక్షించి ఆయకట్టును ప్రకటించనున్నారు. ఉమ్మడి జిల్లాలో ఒక్క కుమురంభీం ప్రాజెక్టు నిల్వ ఆశాజనంగా ఉంది. మరోవైపు వర్షాలు కురిస్తేనే ఈ ప్రాజెక్టుల కింద రైతాంగానికి ఊరట కలగనుంది.

ప్రాజెక్టు	ఆయకట్టు	సామర్థ్యం	ప్రస్తుత నిల్వ	వానాకాలంసాగు	నీటిఅవసరం
కడెం	68,151	4.70	3.14	61,000	5.98
సాత్నాల	24,000	1.240	0.553	24,000	1.030
మత్తడివాగు	9,200	0.571	0.320	9,200	1.00
స్వర్ణ	8,945	1.484	0.388	8,945	1.50
వట్టివాగు	24,500	2.89	1.538	17,180	1.42
కుమురంభీం	23,000	10.393	5.935	26,000	2.40
పీపీరావు	11,150	0.848	0.513	8,000	0.65
సరిపడా నీటి నిల్వ లేని ప్రాజెక్టులు					
గొల్లవాగు	9,500	0.567	0.037	8,000	--
ర్యాలీవాగు	2,267	0.408	0.042	2,200	--
నీల్వాయి	8,000	0.846	0.437	12,790	--
ఎన్టీఆర్	6,000	0.370	0.138	5,400	--
సదర్మట్	1,320	----	---	1,320	--
గడ్డెన్నవాగు	14,000	1.852	0.512	9,000	--
ఎస్సారెస్పీ	35,735	--	---	35,735	--

వివరాలు: ఆయకట్టు, వానాకాలం సాగు (ఎకరాల్లో..); ప్రస్తుత నిల్వ, సామర్థ్యం, నీటి అవసరం (టీఎంసీల్లో)

పండుటాకులకు ఆదరణేది?

- శాపంగా మారిన వృద్ధాప్యం!
- సాంత్వన దొరకక సతమతం
- వెలుగులోకి పలు ఘటనలు



వృద్ధురాలి ఫిర్యాదుతో విచారణ చేపడుతున్న కుంటాల తహసీల్దార్ కమల్‌సింగ్ (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: ఆలనాపాలన లేక వృద్ధ దంపతులు తల్లడిల్లుతున్న ఉదంతాలు జిల్లాలో వెలుగులోకి వస్తున్నాయి. తమ బాగోగులు చూడడం లేదంటూ కొడుకులపై అధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి. తమ స్థిర, చరాస్తులను అనుభవిస్తూ తమను మాత్రం దూరం పెడుతున్నారని పలువురు వృద్ధ తల్లిదండ్రులు గోడు వెల్లబోసుకుంటున్నారు. వారం క్రితం కుంటాల మండలం లింబా (కే) గ్రామానికి చెందిన బంజ లక్ష్మి అనే వృద్ధురాలు తన పిల్లలు పోషణను విస్మరిస్తున్నారని భైంసా ఆర్డీవో కోమల్‌కు ఫిర్యాదు చేసింది. తహసీల్దార్ కమల్‌సింగ్ ఆ గ్రామాన్ని సందర్శించి వృద్ధురాలి పిల్లలతో మాట్లాడారు. కౌన్సెలింగ్ నిర్వహించి ఆమె బాగోగులు, యోగక్షేమాలు, సంరక్షణ చర్యలు చూసుకోవాలని సూచించారు. మూడు నెలల క్రితం దిలావర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి తన అమ్మానాన్నలు సంపాదించిన ఆస్తులు రాయించుకుని వారికి పట్టెడన్నం పెట్టకుండా తీవ్ర మానసిక్షోభకు గురి చేయగా అతడి తల్లిదండ్రులు ఏం చేయాలో తెలియక ఎస్పీని కలిసి గోడు వెల్లబోసుకున్నారు. ఇటీవల సారంగపూర్, దిలావర్‌పూర్ మండలాల్లోనూ ఇలాంటి ఘటనలే వెలుగుచూశాయి.

చట్టాలున్నా చర్యలేవి?

వయోవృద్ధుల సంక్షేమానికి సీనియర్ సిటిజెన్స్ యాక్ట్–2007 సక్రమంగా అమలులో లేదు. వృద్ధుల సామాజిక, ఆర్థిక భద్రత, ఆస్తుల సంరక్షణ లాంటి వాటిపై తగిన చర్యలు లేవు. ఈ చట్టాలపై దృష్టి పెట్టి అవగాహన కల్పించాలని సీనియర్ సిటిజన్లు కోరుతున్నారు. చట్టాల అమలులో తాత్సారం చేయకుండా సంబంధిత అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు. యాక్ట్‌కు అనుగుణంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు వారి సంక్షేమ నియమావళిని రూపొందించాయి. 2011, 2019లో ఈ యాక్ట్‌కు కేంద్రం మరిన్ని రక్షణ సవరణలు చేసినా, అవి పూర్తిస్థాయిలో అమలులోకి రావాల్సి ఉంది. వయోవృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి 'ఎల్డర్ లైన్ 14567' పేరిట హెల్ప్ లైన్ అందుబాటులో ఉంది. దీని ద్వారా పోషణ, సంరక్షణ, నిరాశ్రయ వృద్ధులకు తగిన సహకారం, చట్టపరమైన తోడ్పాటు, మానసిక భావోద్వేగాలకు కౌన్సెలింగ్ సౌకర్యం కల్పిస్తారు. ఈ కార్యక్రమాలన్నీ దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్నారు.

వృద్ధులపై వివక్ష వద్దు



వృద్ధులపై వివక్ష చూపించడం తగదు. వారిని నిరాదరణకు గురి చేయొద్దు. ఎక్కడైనా వివక్ష చూపిస్తే కౌన్సెలింగ్ ఇస్తున్నాం. అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే పదుల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. ఇలాంటి సమస్యలు ఎదుర్కొనే వయోవృద్ధులు హెల్ప్‌లైన్ నంబర్ 14567కు సమాచారం ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– ఫైజాన్ అహ్మద్, జిల్లా సంక్షేమశాఖల అధికారి

మౌలిక వసతుల మెరుగుకు చర్యలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. జిల్లాల్లో 13 ప్రభుత్వ కళాశాలలుండగా, 2,417 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. కళాశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు, మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రవేశాల సంఖ్య పెంచేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పైకప్పుల లీకేజీలు, మరమ్మతులు, అదనపు మరుగుదొడ్లు, ఫ్లోరింగ్, ఆర్వో ప్లాంట్, తలుపులు, కిటికీలు తదితర అంశాలపై సంబంధిత అధికారులు నివేదిక అందజేయాలని తెలిపారు. అవసరమైన చోట ఉపాధిహామీ నిధులతో పనులు చేపట్టాలని, దశలవారీగా అభివృద్ధి పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పరశురాం, డీపీవో శ్రీనివాస్, ఇంజినీరింగ్ అధికారులు, ప్రిన్సిపాల్‌లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని డీఎంహెచ్‌వో రాజేందర్ హెచ్చరించారు. భ్రూణ హత్యలను నివారించి ఆడపిల్లలను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా అడ్వైజరీ కమిటీ (పీసీ అండ్ పీఎన్డీటీ యాక్ట్ 1994) రేడియాలజిస్ట్, గైనకాలజిస్టులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆడపిల్లల ప్రాధాన్యతపై గ్రామ, పట్టణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కల్పించడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. గర్భస్రావాలు నిర్వహించే ఆస్పత్రులు ఎంటీపీ ఆక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. గైనకాలజిస్టులు, రేడియాలజిస్టులు, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి రవీందర్, కార్యక్రమ నిర్వహణాధికారి డాక్టర్ సౌమ్య, విన్ని, వాసు, సఖీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ శ్వేత, డీపీఆర్వో విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

సారంగపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయ సమీపంలోని ఓ ప్రైవేటు అద్దె గదిలో పేకాట స్థావరంపై బుధవారం దాడులు నిర్వహించి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఎస్సై సిబ్బందితో కలిసి వెళ్లి పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.38,340 నగదు, ఏడు సెల్‌ఫోన్‌లు, స్వాధీనం చేసుకున్నారు.

వింత వ్యాధితో 17 మేకలు మృతి



మృతి చెందిన మేకలు

భైంసారూరల్ : మండలంలోని ఇలేగాంలో కదం దత్తురాంకు చెందిన 17 మేకలు వింత వ్యాధి సోకి మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. మంగళవారం ఉదయం మేకలను మేత కోసం గ్రామ శివారులోని అడవికి తీసుకెళ్లాడు. మేత మేస్తుండగానే ఒక్కొక్కటిగా సాయంత్రం వరకు అడవిలోనే ఏడు మేకలు మృతి చెందాయి. దీంతో ఏంచేయాలో తెలియక మిగిలిన మేకలను తోలుకుని ఇంటికి వచ్చి పాకలో తోలాడు. బుధవారం ఉదయం చూసేసరికి మరో 10 మేకలు చనిపోయి ఉన్నాయి. పశువైద్యాధికారి విఠల్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించగా పరిశీలించి సీసీపీపీ(కంటైజెస్ క్యాప్రైన్ ప్లూరో నిమోనియా)తో మృతి చెందినట్లు తెలిపారు. సుమారు రూ.2లక్షల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు



దుకాణం ఎదుట మంటలు

బెల్లంపల్లి: పట్టణంలోని బజారు ఏరియాలో బుధవారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ తీవ్ర కలకలం రేపింది. నో నేమ్ రెడీమేడ్ షాపు ఎదుట ఉన్న విద్యుత్ తీగలపై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కాంటా చౌరస్తా వద్ద నుంచి పాత బస్టాండ్ వైపు వెళ్లే విద్యుత్ తీగలకు మంటలు వ్యాపించడంతో పాదచారులు, వాహనదారులు పరుగులు పెట్టారు. విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించడంతో సరఫరా నిలిపివేసి పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. రెండు తీగలు పరస్పరం తాకడంతో మంటలు వ్యాపించినట్లు గుర్తించారు. ఈ ఘటన బజారు ఏరియాలో చర్చనీయాంశమైంది.

చెట్లు నరికిన వ్యక్తికి జరిమానా

జన్నారం: మండలంలోని తిమ్మాపూర్ పల్లె ప్రకృతి వనంలో 9 చెట్లు నరికిన వ్యక్తికి గ్రామ పంచాయతీ రూ.5 వేలు జరిమానా విధించినట్లు ఎంపీడీవో ఉమర్ షరీఫ్ తెలిపారు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గోల్కొండ రాజవ్వ పల్లె ప్రకృతి వనంలో తొమ్మిది తురాయి చెట్లను అకారణంగా నరకడంతో జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

వైద్య కళాశాలకు అనాథ మృతదేహం



వృద్ధురాలి మృతదేహం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాలలోని కాలేజ్‌రోడ్‌లో నిర్వహిస్తున్న అనాథ వృద్ధుల, మానసిక దివ్యాంగుల ఆశ్రమానికి మందమర్రిలో నిస్సహాయ స్థితిలో రహదారి పక్కన ఉన్న వృద్ధురాలు(90)కు గత నెల 28 న మందమర్రి ఎస్సై రాజశేఖర్ సూచన మేరకు మేరకు ఆశ్రమంలో చోటు కల్పించారు. సదరు వృద్ధురాలు మంగళవారం తుదిశ్వాస విడిచింది. ఎస్సై సూచన మేరకు మృతదేహాన్ని బుధవారం ప్రభుత్వ వైద్య కళాశాలకు అప్పగించారు. అయినప్పటికీ మృతురాలికి సంబంధించి బంధువులెవరైనా ఉంటే 9701973636 నంబర్‌ను సంప్రదిస్తే మృతదేహం అప్పగిస్తామన్నారు. లేనిపక్షంలో వైద్యకళాశాల వినియోగిస్తుందని ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు ములుకాల కుమార్ తెలిపారు.



అర్ధరాత్రి దొంగల బీభత్సం

- చింతలమానెపల్లి, కౌటాల మండలాల్లో చోరీలు
- చేతికి చిక్కినట్టే చిక్కి.. తప్పించుకుని పరారీ
- ద్విచక్ర వాహనం, ఫోన్ స్వాధీనం



చింతలమానెపల్లి: డబ్బా గ్రామంలోని ఫర్టిలైజర్ దుకాణంలో ధ్వంసం చేసిన డీవీఆర్, సీసీకెమెరా



కౌటాలలో ఉపాధ్యాయుడు తిరుపతి ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

చింతలమానెపల్లి/కౌటాల: చింతలమానెపల్లి, కౌటాల మండలాల్లో మంగళవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. చోరీకి పాల్పడి పారిపోతుండగా ఓ ఉపాధ్యాయుడు సాహసించి పట్టుకునే ప్రయత్నం చేయగా చేజారాడు. ఎస్సైకి ఎదురుపడగా.. అనుమానంతో పట్టుకునే ప్రయత్నం చేయగా చిక్కినట్టే చిక్కి పారిపోయారు. ప్రత్యక్ష సాక్షులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలమానెపల్లి మండలం డబ్బా గ్రామం అడెపల్లి చౌరస్తాలోని శ్రీసాయి ఫర్టిలైజర్ దుకాణంలో మంగళవారం రాత్రి 10.30గంటలకు దొంగలు చోరీకి పాల్పడ్డారు. దుకాణం వెనుక వైపు తలుపు పగులగొట్టి రూ.70వేలు ఎత్తుకెళ్లడంతోపాటు సీసీ కెమెరాలు, డీవీఆర్ ధ్వంసం చేశారు. ఉదయం గమనించిన యజమాని మహేష్‌గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కౌటాలలో చేతికి చిక్కి..

కౌటాల మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎడ్ల తిరుపతి ఇంటికి తాళం వేసి కరీంనగర్‌కు వెళ్లారు. రాత్రి 11గంటల ప్రాంతంలో తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో ఇద్దరు దొంగలు ఉండడాన్ని గమనించి వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. ఓ దొంగను పట్టుకోగా ఇద్దరి మధ్య పెనుగులాట జరిగింది. అతడి బట్టలు సైతం చిరిగిపోయాయి. సెల్‌ఫోన్ అక్కడే పడిపోయింది. అయినా గోడ దూకిన దొంగ అక్కడి నుంచి పారిపోయాడు.

పెట్రోలింగ్ పోలీసులకు ఎదురుపడి..

ఇదే సమయంలో కౌటాలలో ఎస్సై గుంపుల విజయ్ వాహనాల తనిఖీ, పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. రాత్రి 12గంటల ప్రాంతంలో మోటార్‌సైకిల్ వేగంగా రావడాన్ని గమనించి అనుమానంతో అనుసరించారు. దీంతో దొంగలు మోటార్‌సైకిల్‌ను ధనురేటి గ్రామ సమీపంలో వదిలేసి పారిపోయారు. మోటార్‌సైకిల్ నంబరు ఆధారంగా మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలో రిజిస్ట్రేషన్ అయినట్లుగా పోలీసులు గుర్తించారు. మోటార్‌సైకిల్‌తోపాటు మొబైల్‌ఫోన్‌ను కౌటాల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, రెండు మండలాల్లో చోరీకి పాల్పడింది ఒకే ముఠా దొంగలని తెలుస్తోంది. డబ్బాలో చోరీకి పాల్పడడానికి సమీపంలోని మెకానిక్ దుకాణం నుంచి గునపాన్ని దొంగిలించి అదే గునపంతో డబ్బా, కౌటాలలో తలుపులను పగులగొట్టినట్లు సీసీ కెమెరాల్లో వీడియోలను బట్టి తెలుస్తోంది. వేర్వేరుగా నమోదైన కేసుల్లో విచారణను వేగవంతం చేశామని, దొంగలను త్వరలో పట్టుకుంటామని కౌటాల ఎస్సై గుంపుల విజయ్, చింతలమానెపల్లి ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపారు.

సింగరేణి ఇన్‌చార్జిగా కొప్పుల ఈశ్వర్

- టీబీజీకేఎస్ నేతలతో కేటీఆర్ భేటీ



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న టీబీజీకేఎస్ నేతలు

శ్రీరాంపూర్: సింగరేణిలో టీబీజీకేఎస్‌ను మరింత బలోపేతం చేసే దిశగా బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా టీబీజీకేఎస్ నాయకులతో బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమై దిశానిర్దేశం చేశారు. పార్టీ నుంచి సింగరేణికి ఇన్‌చార్జిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ సింగరేణిలో యూనియన్‌కు పూర్వవైభవం తీసుకురావాలని సూచించారు. ఏ ప్రభుత్వం చేయని మేలును బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులకు చేసిందన్నారు. సింగరేణి, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు అనేక హామీలు ఇచ్చి గెలిచాక మోసం చేశారని విమర్శించారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలమయ్యారని, వారి వైఫల్యాలను ఎత్తి చూపుతూ కార్మిక క్షేత్రాల్లో పోరాడాలని తెలిపారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణపై బీజేపీ, కాంగ్రెస్ ఒకటే వైఖరి అవలంబిస్తున్నాయని, ఆ పార్టీలు, ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను అడ్డుకోవాలని అన్నారు. పోరాటాలు చేయడంలో ఏ సమస్య వచ్చినా కార్యకర్తలను ఆదుకోవడానికి పార్టీ లీగల్ సెల్ ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందని తెలిపారు. త్వరలో సింగరేణిలో పర్యటించి విస్తృతంగా సమావేశాలు ఏర్పాటు చేస్తామని కేటీఆర్ చెప్పినట్లు నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, చీఫ్ జనరల్ సెక్రెటరీ కాపు కృష్ణ, ప్రధాన కార్యదర్శులు మాదాసు రామ్మూర్తి, కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, సీనియర్ ఉపాధ్యక్షుడు పారుపల్లి రవి, అధికార ప్రతినిధి వడ్డేపల్లి శంకర్, ఐలి శ్రీనివాస్, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క విద్యార్థి.. ముగ్గురి పర్యవేక్షణ



విద్యార్థిని పర్యవేక్షిస్తున్న అధికారులు

ఖానాపూర్: ఉపాధ్యాయుల కొరత, సౌకర్యాల లేమి వంటి కారణాలతో విద్యార్థులను ప్రభుత్వ బడులకు పంపేందుకు తల్లిదండ్రులు అంతగా ఆసక్తి చూపడం లేదు. దీంతో గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల సంఖ్య రోజురోజుకు తగ్గుతోంది. మండలంలోని అడవి సారంగాపూర్ పంచాయతీ పరిధి రాజులమడుగులోని ఐటీడీఏ ప్రాథమిక పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడితో పాటు ముగ్గురు విద్యార్థులు ఉన్నారు. కొద్దిరోజులుగా ఇద్దరు గైర్హాజరు అవుతుండడంతో ఒకే విద్యార్థి పాఠశాలకు వస్తున్నాడు. బుధవారం నిర్మల్ ఏసీఎంవో శివాజీ ఎస్సీఆర్టీ జంగు పటేల్‌తో కలిసి పాఠశాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో ఒకే విద్యార్థి భీష్మ అందుబాటులో ఉన్నాడు. ఉపాధ్యాయుడితో పాటు ఇద్దరు అధికారులు కలిసి ఒక్క విద్యార్థిని పర్యవేక్షించాల్సి వచ్చింది.

తెలంగాణ వర్సిటీకి ప్రత్యేక గుర్తింపు

- వర్సిటీ చాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- రెండో స్నాతకోత్సవంలో పట్టాల ప్రదానం
- 113 మందికి గోల్డ్‌మెడల్స్.. 157 మందికి డాక్టరేట్‌లు అందజేత



మాట్లాడుతున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రం పేరుతో ఏర్పడిన తెలంగాణ యూనివర్సిటీకి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని వర్సిటీ చాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. తెయూ రెండో స్నాతకోత్సవాన్ని(కాన్వొకేషన్) బుధవారం డిచ్‌పల్లి క్యాంపస్‌లో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ 2006లో ఆరు కోర్సులతో ప్రారంభమైన తెయూ.. నేడు ఏడు విభాగాలు, 24 ఉప విభాగాలుగా 31 కోర్సులతో కొనసాగుతోందన్నారు. తెయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టీ యాదగిరిరావు మాట్లాడుతూ వర్సిటీలో ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

బంగారు పతకాలు.. డాక్టరేట్ పట్టాలు

2014 నుంచి 2023 వరకు 15 విభాగాల్లో 130 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపగా, దరఖాస్తు చేసుకున్న 113 మందికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యఅతిథి ప్రొఫెసర్ చంద్రశేఖర్ చేతుల మీదుగా స్నాతకోత్సవంలో బంగారు పతకాలు అందజేశారు. 2017 నుంచి 2025 జూన్ వరకు ఏడు విభాగాల్లో పరిశోధనలు పూర్తి చేసుకున్న 157 మంది పరిశోధకులకు పీహెచ్‌డీ(డాక్టరేట్) పట్టాలను అందజేశారు.

వైద్యానికి కావొద్దు వాగు అడ్డంకి



వాగు దాటుతున్న వైద్యసిబ్బంది

కెరమెరి: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మండలంలోని టెమ్లగూడ వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. బుధవారం నడుములోతులో నీళ్లు ఉన్నప్పటికీ వైద్యసిబ్బంది వాగుదాటి అవుతల ఉన్న సామ్లగూడ, తుమ్మగూడ, టెమ్లగూడ గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 43 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మాత్రలు అందించారు. రక్తపూతలు సేకరించారు. వర్షాకాలంలో సంక్రమించే వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మెస్రం సోము, హెచ్‌ఏలు శంకర్, వసంత్, ఏఎన్ఎంలు సంఘమిత్ర, సుమలత పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడిన ఒకరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడిన విద్యానగర్‌కు చెందిన మణిశేఖర్‌పై కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. పట్టణంలోని బొక్కల్‌గూడకు చెందిన మహ్మద్ అబ్దుల్ వసీమ్ 2024 డిసెంబర్‌లో రాంలీలా మైదానంలో ఎగ్జిబిషన్ మేనేజర్‌గా వ్యవహరించాడు. మణిశేఖర్ వసీమ్‌ను బెదిరించి రూ.2లక్షలు ఇవ్వాలని, లేదంటే హైకోర్టుకు వెళ్లి ఎగ్జిబిషన్ బంద్ చేయిస్తానని బెదిరించాడు. దీంతో బాధితుడు రూ.20వేలు ఇచ్చాడు. మిగితా డబ్బులు తర్వాత ఇవ్వాలని, లేదంటే చంపుతానని హెచ్చరించాడు. దీంతో బాధితుడు మంగళవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి మణిశేఖర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఆకుల అనన్య

జన్నారం: మండలంలోని కిష్టాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ఆకుల అనన్య బుధవారం మంచిర్యాలలో నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రాజన్న తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవ్ బీఫోర్ ఇట్స్ టూ లేట్ అనే కామిక్ వ్యాస రచన, కామిక్ డ్రాయింగ్ పోటీలో పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు ఆయన పేర్కొన్నారు. గెలుపొందిన విద్యార్థినిని, గైడ్ టీచర్స్ దాముక కమలాకర్, మణెమ్మను డీఈవో ఎస్.యాదయ్య, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

రోడ్డు కబ్జా చేసిన ఇద్దరి రిమాండ్



మాట్లాడుతున్న ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: నకిలీ పత్రాలు సృష్టించి రోడ్డును కబ్జా చేసిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. బుధవారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్‌కు చెందిన రంగినేని శ్రీనివాస్ శాంతినగర్‌లోని మున్సిపల్ రోడ్డుకు తన బావ అమూల్ పేరిట డోర్ నంబర్ తీసుకొని ఇంటి పన్నులు చెల్లించాడు. ఆ తర్వాత అమూల్ తన భార్య శ్వేత పేరిట గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించాడు. దీంతో మున్సిపల్ వారు ఆ స్థలాన్ని రంగినేని శ్వేత పేరిట మ్యూటేషన్ చేశారు. ఆదిలాబాద్అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో రెగ్యులరైజేషన్ కోసం రూ.22,900 చలాన్ చెల్లించినట్లు నకిలీ పత్రాలు సృష్టించాడు. రెవెన్యూ అధికారులు క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీ చేసినట్లు నకిలీ పత్రాలు తయారు చేశాడు. ఆ తర్వాత ఇంటి నిర్మాణం కోసం మున్సిపల్ నుంచి పర్మిషన్ తీసుకోగా అధికారులు అనుమతించారు. ఈ స్థలాన్ని విక్రయించేందుకు సైతం సిద్ధమైనట్లు పేర్కొన్నారు. కాగా ఈ రోడ్డు పక్కన ఉన్న జిన్నింగ్ ఫ్యాక్టరీ గేటును కబ్జా చేసి స్థలాన్ని ఆక్రమించడంతో కౌటివార్ సుశీల్ వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. పత్రాలను పరిశీలించగా నకిలీవని తేలింది. దీంతో రంగినేని శ్రీనివాస్‌తో పాటు అతని తండ్రి సూర్యప్రకాశ్‌రావు, చెల్లెలు శ్వేత, బావ అమూల్‌పై కేసు నమోదు చేయగా శ్రీనివాస్, అమూల్‌ను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో వన్‌టౌన్, రూరల్ సీఐలు సునీల్ కుమార్, ఫణిందర్ పాల్గొన్నారు.

ఐదుగురి రిమాండ్..

గుడిహత్నూర్‌కు చెందిన జాదవ్ రమేశ్ కేఆర్‌కే కాలనీలోని సర్వే నం.68లో ప్లాట్ కొనుగోలు చేయగా అట్టి స్థలాన్ని ఆదిలాబాద్ పట్టణానికి చెందిన 8 మంది ఆక్రమించేందుకు యత్నించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఆ ప్లాట్‌ను తక్కువ ధరకు విక్రయించాలని, బెదిరింపులకు పాల్పడినట్లు బాధితుడు ఫిర్యాదు చేయడంతో మహ్మద్ ముజాహిద్ అలియాస్ పత్తి ముజ్జు, ఇస్మాయిల్ అలియాస్ తౌఫిక్, షేక్ ఆబిద్, షేక్ ఆదిల్, సర్ల బుచ్చన్నను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, ఆదినాథ్, అతీఖ్, సయ్యద్ అహ్మద్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



రాజేంద్రప్రసాద్(ఫైల్)

నెన్నెల: ఈ నెల 10న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని కోణంపేటకు చెందిన దుర్గం రాజేంద్రప్రసాద్ (26) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన రాజేంద్రప్రసాద్ రెండేళ్ల క్రితం ప్రైవేట్ ఫైనాన్స్‌లో బొలెరో తీసుకున్నాడు. గిరాకీ లేకపోవడంతో ఈఎంఐలు కట్టలేకపోతున్నానని ఇంట్లో చెప్పుకుని బాధపడుతుండేవాడు. దీంతో మనస్తాపానికి గురై ఇంటి వద్ద గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా బెల్లంపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యంకోసం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తండ్రి సతీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై వివరించారు.

ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని..



త్రివేణి (ఫైల్)

నేరడిగొండ: కుంటాల బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న ఓ విద్యార్థిని హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మామడ మండలంలోని వాస్తాపూర్‌కు చెందిన ఆత్రం త్రివేణి (15) ఈనెల 11న శుక్రవారం వాంతులు చేసుకోవడంతో అప్రమత్తమైన పాఠశాల సిబ్బంది నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం శనివారం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. సదరు విద్యార్థిని నెలక్రితం గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమానికి వెళ్లిన సమయంలో గాలిదుమారం వీచింది. దీంతో టెంటు కర్ర ఆమె తలపై పడడంతో గాయాలుకాగా స్థానిక ఆర్ఎంపీ వద్ద చికిత్స చేయించారు. అనంతరం పాఠశాల పునఃప్రారంభం తర్వాత ఈ సంఘటన చోటు చేసుకుంది.

వ్యాపారి ఇంటి ఎదుట రైతుల ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని బీట్‌బజార్‌కు చెందిన విశ్వనాథం అనే వ్యాపారి ఇంటి ఎదుట బుధవారం లక్సెట్టిపేట, దండేపల్లి మండలాలకు చెందిన రైతులు ఆందోళన చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన శ్రీధర్ లక్సెట్టిపేట, దండేపల్లి మండలాల రైతుల వద్ద ధాన్యం కొనుగోలు, ఇతర లావాదేవీలు కొనసాగిస్తుండేవాడు. ఈక్రమంలో పలువురి వద్ద అప్పులు తీసుకుని చెల్లించలేకపోయాడు. కొద్ది రోజుల క్రితం ఐపీ పేరుతో నోటీసులు పంపుతున్నాడనే సమాచారంతో అప్పు ఇచ్చిన రైతులు ఈ నెల 8 న శ్రీధర్ ఇంటిఎదుట ఆందోళన చేపట్టారు. పోలీసులు ఫిర్యాదు చేయాలని చెప్పడంతో తిరిగి వెళ్లిపోయారు. వ్యాపారి విశ్వనాథం కూడా శ్రీధర్‌కు డబ్బులు అప్పుగా ఇచ్చాడు. దీంతో దండేపల్లిలో ఉన్న భూమి అప్పు కింద రాయించుకున్నాడని, అట్టి భూమిని బాధితులందరికీ పంచాలని బుధవారం రైతులు విశ్వనాథం ఇంటిఎదుట ఆందోళన చేపట్టారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై గోపతి సురేష్ రైతులతో మాట్లాడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పడంతో తిరిగి వెళ్లిపోయారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య



పంచనామా నిర్వహిస్తున్న ఏఎస్సై పోశెట్టి

వాంకిడి: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఎనోలి గ్రామానికి చెందిన సోయం మారు (35) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిస కావడంతో నిత్యం భార్యతో గొడవపడేవాడు. మంగళవారం అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చి కుమారుడు గణేశ్‌ను కొట్టాడు. దీంతో భార్య నీలాబాయి నిలదీయడంతో రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. బుధవారం గ్రామ శివారులోని ఓ చేనులో చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి మహిళ..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మానసిక వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపిన వివరాల మేరకు జన్నారంకు చెందిన గుండ భూమ య్య, సునీత (36) దంపతులు తమ పిల్లలతో కలిసి తల్లిగారి ఊరైన హాజీపూర్‌లో నివాసం ఉంటున్నారు. ముల్కల్లకు చెందిన సమీప బంధువులైన ఇరువురు దంపతులు సునీతపై తీవ్ర ఆరోపణలు చేస్తూ మానసికంగా వేధించడమే కాకుండా ఆత్మహత్యకు ప్రేరేపించారు. దీంతో మంగళవారం గుర్తు తెలియని పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం వరంగల్ రెఫర్ చేశారు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. భర్త భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో వృద్ధుడు..

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గద్దెరాగిడి సాయికుటీర్ ప్రాంతానికి చెందిన చింతల సుధాకర్(71)బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మద్యానికి బానిసైన సుధాకర్ తరచూ ఇంట్లో కుటుంబసభ్యులతో గొడవపడేవాడు. మానసికంగా ఒంటరినన్న భావనతో జీవితంపై విరక్తి చెంది ఉరేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లుఎస్సై తెలిపారు.

19న రాష్ట్ర సదస్సు

పాతమంచిర్యాల: ఇల్లెందులో ఈ నెల 19న నిర్వహించనున్న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంథెన మల్లన్న కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి జ్యోతి, నాయకులు కిష్టయ్య, రాజన్న, దీపిక, అరుణ, సూరి, తదితరులు పాల్గొన్నారు.

ఏడేళ్లకే నూరేళ్లు..

- జ్వరంతో బాలిక మృతి
- ముత్తంపేటలో విషాదం



మన్విత (ఫైల్)

కౌటాల: ఆ బాలికకు ఏడేళ్లకే నూరేళ్లు నిండాయి. విషజ్వరం ఆ చిన్నారిని బలి తీసుకుంది. అల్లారు ముద్దుగా చూసుకుంటున్న ఒక్కగానొక్క కుమార్తె మృతితో ఆ కుటుంబంలో తీరని విషాదం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కుమురంభీం జిల్లా కౌటాల మండలం ముత్తంపేటకు చెందిన రైపూర్ నాగేశ్వర్, జయ దంపతులకు కుమార్తె మన్విత (7), కుమారుడు ఉన్నాడు. నాగేశ్వర్ వ్యవసాయ కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మన్విత స్థానిక ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. మంగళవారం పాఠశాలకు వెళ్లిన బాలికకు జ్వరం రావడంతో ఉపాధ్యాయులు ఇంటికి పంపించారు. రాత్రి తల్లి స్థానిక ఆశ వర్కర్ వద్ద పారాసిటమల్ మాత్రలు అడిగి వేశారు. జ్వరం తగ్గకపోవడంతో బుధవారం కౌటాల పీహెచ్‌సీకి తీసుకెళ్లగా సిబ్బంది మందులు ఇచ్చి ఇంటికి పంపించారు. బుధవారం సాయంత్రం ఇంటి వద్ద బట్టల్లోనే మూత్రం పోసుకుని కిందపడిపోయింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందింది.

పోస్టాఫీసుల్లో కొత్త సాఫ్ట్‌వేర్

పాతమంచిర్యాల: జిల్లాలోని పోస్టాఫీసుల్లో ఐటీ 2.0 కొత్త సాఫ్ట్‌వేర్ ప్రవేశపెడుతున్నట్లు పోస్టల్ అధికారులు తెలిపారు. ఈక్రమంలో ఈ నెల 21, 22 తేదీలలో జిల్లాలో రెండు రోజుల పాటు పోస్టల్ సేవలు నిలిపివేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. దీంతో పోస్టాఫీసుల్లో ఎలాంటి లావాదేవీలు జరుగవని, వినియోగదారులు గమనించి సహకరించాలని వారు కోరారు. గతంలో ఉన్న సాఫ్ట్‌వేర్ స్థానంలో కొత్త సాఫ్ట్‌వేర్ రానుండడంతో పోస్టల్ సేవలలో వేగం పెరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.